ఎడిటర్ :
మంచె శరత్ చంద్ర

సంపుటి : 13
సంచిక : 292

పేజీలు : 5 వెల రూ. 2/-

మంగళవారం
25 నవంబర్ 2025

PUBLISHED FROM :
HYDERABAD

# AM న్యూస్

ప్రతిదినం ప్రత్యేకం

www.amnews7.com

## కోకాపేటలో తిరగరాసిన రికార్డులు

ఎకరం ధర రూ.137.25 కోట్లు



2 లో

## ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సూర్యకాంత్ ప్రమాణం

- ప్రమాణం చేయించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము
- హాజరైన పలుదేశాల న్యాయమూర్తులు



2 లో

# అన్ని రంగాల్లో పిల్లలు రాణించాలి

- చదువుతోనే ఉజ్వల భవిష్యత్
- కొడంగల్‌లో రూ.5వేల కోట్లతో ఎడ్యుకేషన్ క్యాంపస్
- తెలంగాణ నోయిడాగా కొడంగల్ అభివృద్ధి
- అభివృద్ధికి ప్రజలంతా అండగా నిలవాలి
- గతంలో ఎవరు సిఎం ఉన్నా కొడంగల్‌ను పట్టించుకోలే
- అక్కడి అక్షయపాత్ర ఫౌండేషన్ కిచెన్‌కు శ్రీకారం
- సొంత నియోజకవర్గం పర్యటనలో సిఎం రేవంత్ రెడ్డి



## ప్రభుత్వాసుపత్రుల్లో సౌకర్యాలు మృగ్యం

- వసతుల కల్పనకు కేంద్రం చర్యలు
- సక్రమంగా వినియోగించుకోని రాష్ట్ర ప్రభుత్వం
- జమ్మికుంటలో ఆధునిక వైద్య పరికరాలు ప్రారంభించిన బండి



2 లో

## నిరంజన్ రెడ్డి అవినీతితోనే ఓడారు

- ఫామ్‌హౌజ్‌లు కట్టుకుని పార్టీకి చెడ్డపేరు
- మాజీమంత్రిపై జాగృతి అధ్యక్షురాలు కవిత ఫైర్



2 లో

## జిహెచ్ఎంసి ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

- కౌన్సిల్ సమావేశంలో సమస్యలపై పోరాడాలి
- గ్రేటర్ కార్పొరేటర్లకు కెటిఆర్ దిశానిర్దేశం

2 లో




## నేడు అయోధ్యలో ప్రధాని మోడీ పర్యటన

రామాలయంపై పతాకాన్ని ఆవిష్కరించనున్న మోడీ



2 లో

# అన్ని రంగాల్లో పిల్లలు రాణించాలి

**ఏఎం న్యూస్, కొడంగల్,నవంబరు 24:** మన పిల్లలు అన్ని రంగాల్లో రాణించాలని, అత్యున్నత స్థానంలో ఉండాలన్నదే తన ఆకాంక్ష అని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ నోయిడాగా కొడంగల్ నియోజకవర్గాన్ని తీర్చిదిద్దుతాం అన్నారు. గతంలో ఏ ముఖ్యమంత్రి ఉన్నా ఇటువైపు చూడలేదని, అందుకే మీరిచ్చిన ఈ అవకాశంతో కొడంగల్‌ను తీర్చిదిద్దబోతున్నానని అన్నారు. అభివృద్ధితో వెళతున్న తనకు మీ ఆశర్వాదంతో మద్దతు పలకాలన్నారు. రాబోయే కొన్ని నెలల్లో కొడంగల్ రైల్వే పనులు ప్రారంభ మవుతాయి. నియోజకవర్గంలో సిమెంట్ పరిశ్రమ ఏర్పాటు చేయబోతున్నాం అని అన్నారు. కొడంగల్‌లో ఏ విద్యార్థీ ఆకలితో ఉండకూడదన్న లక్ష్యంతో ఏర్పాట్లు చేస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రస్తుతం నియోజకవర్గంలో 28 వేల మందికి ఉదయం అల్పాహారం అందిస్తున్నామన్నారు. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో 5 వేల మంది విద్యార్థులు పెరిగారని చెప్పారు. సొంత నియోజకవర్గం కొడంగల్ పర్యటనకు వెళ్లిన రేవంత్ రెడ్డి.. అక్కడి అక్షయపాత్ర ఫౌండేషన్ కిచెన్‌ను పరిశీలించారు. మిడ్‌డే మీల్స్ కిచెన్ భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. జీవితాల్లో మార్పు రావాలంటే పిల్లల్ని చదివించాలన్నారు. కొడంగల్‌లో రూ.5వేల కోట్లతో ఎడ్యుకేషన్ క్యాంపస్ నిర్మిస్తున్నాం. రాష్ట్రంలో తొలి సైనిక్ స్కూల్‌ను ఇక్కడే ఏర్పాటు చేయబోతున్నాం. 16 నెలల్లోగా కొడంగల్‌ను అంతర్జాతీయ ఎడ్యుకేషన్ హబ్‌గా తయారు చేస్తాం అని ప్రకటించారు. మహిళలు ఆత్మగౌరవంతో బతికేందుకు కృషి చేస్తున్నాం. రాష్ట్రంలోని ప్రజలకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్నాం. మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కల్పిస్తున్నాం. వెయ్యి ఆర్టీసీ బస్సులకు వారిని యజమానులుగా చేశాం. సోలార్ పవర్ ప్లాంట్లు, పెట్రోల్ బంకులకు కూడా యజమానులను చేశాం అని వెల్లడించారు. అదానీ, అంబానీలతో పోటీపడేలా



వారిని ప్రోత్సహిస్తున్నాం. మహిళా సంఘాల ఉత్పత్తులు అమెజాన్‌లో అమ్ముకునేలా ఏర్పాట్లు చేస్తున్నాం అని అన్నారు. మూడు నెలల్లో కొడంగల్‌లోని ప్రతి గ్రామానికి కృష్ణా నీళ్లు అందిస్తాం. లగచర్ల పారిశ్రామికవాడకు అంతర్జాతీయస్థాయి గుర్తింపు తీసుకొస్తాం.త్వరలో సర్పంచ్ ఎన్నికలు రాబోతున్నాయి. 3, 4 రోజుల్లో సర్పంచ్ ఎన్నికలకు నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉంది. అభివృద్ధికి మద్దతుగా ఉండేవారిని సర్పంచ్‌లుగా ఎన్నుకోవాలని రేవంత్ పిలుపునిచ్చారు. ప్రజలకు కోట్ల రూపాయలు ఇవ్వలేనని.. పిల్లలకు అంతకంటే విలువైన చదువు చెప్పించగలనని అన్నారు. చదువు జీవితాలను ఉన్నత స్థాయికి తీసుకెళ్తుందని అన్నారు. అందులో భాగంగా కొండంగల్ లో 5 వేల కోట్ల రూపాయలతో ఎడ్యుకేషన్ క్యాంపస్ నిర్మించుకున్నామని ఈ సందర్భంగా గుర్తు చేశారు. సిఎం పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడంతో కొడంగల్ నియోజకవర్గ అభివృద్ధి పనులకు కొత్త ఊపు వచ్చింది. మొత్తం రూ.103 కోట్ల వ్యయంతో చేపట్టనున్న వివిధ కార్యక్రమాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం శంకుస్థాపన చేశారు. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని, పట్టణాభివృద్ధి నుంచి విద్య, సంక్షేమం వరకు అనేక రంగాల్లో ఈ పనులు ప్రారంభమవడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా, నియోజకవర్గంలో మొత్తం 28 అంగన్‌వాడీ భవనాల నిర్మాణానికి రూ.5.83 కోట్లు, అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో 23 అదనపు తరగతి గదుల నిర్మాణానికి రూ.5.01 కోట్లు కేటాయించారు. గ్రామీణ పరిపాలనను బలోపేతం చేసేందుకు 10 గ్రామపంచాయతీ భవనాల నిర్మాణానికి రూ.3 కోట్లు వెచ్చించనున్నారు. బంజారా భవన్‌లో అదనపు సౌకర్యాల కోసం కాంపౌండ్ వాల్, డైనింగ్ హాల్, నీటి సరఫరా, విద్యుదీకరణకు కలిపి రూ.3.65 కోట్లు మంజూరు చేశారు. కొడంగల్ పట్టణ మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తూ, ప్రొహిబిషన్ / ఎక్సైజ్ స్టేషన్ నిర్మాణానికి రూ.1 కోటి, అగ్నిమాపక కేంద్రానికి రూ.1.30 కోట్లు, స్విమ్మింగ్ పూల్ నిర్మాణానికి రూ.1.40 కోట్లు కేటాయించారు. అలాగే కమ్యూనిటీ హాళ్లు, కిచెన్ షెడ్లు, కాంపౌండ్ వాల్స్ నిర్మాణానికి రూ.4.91 కోట్లు, సీసీ రోడ్లు , భూగర్భ డ్రైనేజ్ (జఉఆ) వ్యవస్థ అభివృద్ధికి రూ.4.45 కోట్లు ఖర్చు చేయనున్నారు. ఇప్పటికే నిర్మించిన అదనపు తరగతి గదులు, అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రంథాలయ భవనాల ప్రారంభోత్సవం కూడా ఈ సందర్భంగా జరిగింది, వీటి కోసం రూ.2.95 కోట్లు వెచ్చించారు. కొడంగల్ పట్టణ అభివృద్ధి దిశగా అత్యంత కీలకంగా పరిగణిస్తున్న రోడ్డు విస్తరణ పనులకు ఒక్కటే రూ.60 కోట్లు కేటాయించగా, కొత్త గెస్ట్ హౌస్ నిర్మాణానికి రూ.5 కోట్లు మంజూరు చేశారు. కోస్గి వ్యవసాయ మార్కెట్‌లో చేపట్టనున్న అభివృద్ధి పనులకు రూ.4.50 కోట్లు మంజూరు చేయడం రైతులకు ఉపయోగకరంగా ఉండనుంది. ఈ మొత్తం ప్రాజెక్టులు కొడంగల్ నియోజకవర్గపు సామాజిక, ఆర్థిక అభివృద్ధికి ముఖ్య పాత్ర పోషిస్తాయని, ఈ ప్రాంత ప్రజల అవసరాలను తీర్చడంలో పెద్ద అడుగుగా నిలుస్తాయని అధికారులు పేర్కొన్నారు.

# ప్రభుత్వాసుపత్రుల్లో సౌకర్యాలు మృగ్యం

**ఏఎం న్యూస్, కరీంనగర్,నవంబరు 24:** పేద ప్రజలు అత్యవసర చికిత్స కోసం ప్రభుత్వ ఆసుపత్రులను విశ్వసించి వస్తారని, ఆ నమ్మకాన్ని పెంపొందించే దిశలో కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని బండి సంజయ్ తెలిపారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ఈ అవకాశాలను సక్రమంగా వినియోగించుకోలేక పోతుందని ఆయన విమర్శించారు. జమ్మికుంట పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో కోటి యాభై లక్షల రూపాయల సిఎస్సార్ నిధులతో కొనుగోలు చేసిన అత్యాధునిక వైద్య పరికరాలను కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవల బలోపేతంపై పలు కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం ప్రభుత్వ ఆసుపత్రుల్లో సరైన సౌకర్యాలు లేక పేదలకు నమ్మకం తగ్గిపోతున్నదని, ఈ పరిస్థితిని మార్చడానికి కేంద్రం కట్టుబడి ఉందని తెలిపారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో ఇప్పటివరకు సిఎస్సార్ నిధుల ద్వారా ఐదు కోట్ల రూపాయలు అందజేసి ఆధునిక పరికరాలను తీసుకురావడంలో విజయవంతమయ్యామని చెప్పారు. ఆసుపత్రిలో పోస్టుమార్టం రూమ్, ఎక్స్?రే మిషన్‌తో పాటు అవసరమైన ఇతర పరికరాలను ఎంపీ నిధుల ద్వారా త్వరలోనే అందజేస్తామని హామీ ఇచ్చారు. పరికరాల లేమి పేరుతో పేద రోగులను కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి రిఫర్ చేయొద్దని వైద్యులకు సూచించారు. సేవా దృక్పథంతో పనిచేస్తే ప్రజల్లో ప్రభుత్వ ఆసుపత్రులపై మంచి విశ్వాసం ఏర్పడుతుందని అన్నారు. రాష్ట్రంలోని చెక్‌డ్యాంల నిర్మాణంలో భారీ అవినీతి జరిగిందని బండి సంజయ్ ఆరోపించారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం కాంట్రాక్టర్ల వద్ద నుంచి కమిషన్లు తీసుకుందని, ప్రణాళిక లేకుండా చెక్‌డ్యాంలను నిర్మించారని పేర్కొన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఉన్న కాంట్రాక్టర్లు ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంలో కూడా కొనసాగుతున్నారని అన్నారు.



చెక్‌డ్యాంలపై విచారణ జరిపించి అవినీతి నిర్ధారణ అయితే కాంట్రాక్టర్ల నుంచి నిధులు రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. జమ్మికుంట రైల్వే స్టేషన్‌ను పూర్తిగా ఆధునీకరించేందుకు త్వరలో ప్రపోజల్స్ పంపుతామని, జమ్మికుంటలో స్టేడియం నిర్మాణం కోసం నిధులు కేటాయిస్తామని బండి సంజయ్ ప్రకటించారు.

# జిహెచ్ఎంసి ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

**ఏఎం న్యూస్, హైదరాబాద్,నవంబర్24:** జీహెచ్ఎంసీ ఎన్నికలు ఎప్పుడు పెట్టినా సిద్ధంగా ఉండాలని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సూచించారు. అలాగే మంగళవారం జరిగే కౌన్సిల్ సమావేశంలో బల్దియాలోని సమస్యలు ప్రస్తావించాలన్నారు. ప్రభుత్వ వైఫల్యాలు, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, పారిశ్రామిక భూముల అమ్మకంపై నిలదీయాలని సూచించారు. గ్రేటర్ హైదరాబాద్ నేతలతో కేటీఆర్ సమావేశమయ్యారు. జీహెచ్ఎంసీ పరిధిలోని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేటర్లు, మాజీ ప్రజా ప్రతినిధులతో తెలంగాణ భవన్‌లో భేటీ అయ్యారు. మంగళవారం జరుగనున్న గ్రేటర్ మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో అనుసరించాల్సిన వ్యూహం, జీహెచ్ఎంసీ ఎన్నికలకు సన్నద్ధతపై చర్చించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్లకు వివిధ అంశాలపై కేటీఆర్ మార్గ దర్శనం చేశారు. పది సంవత్సరాల పాటు అధికారంలో ఉండి ఎలాంటి అవినీతికి తావు లేకుండా అద్భుతంగా పదవీకాలం పూర్తి చేసుకోబోతున్నారని పార్టీ తరపున వారికి అభినందనలు తెలిపారు. ముఖ్యంగా రెండోసారి జీహెచ్ఎంసీలో గెలిచిన తర్వాత కరోనా వంటి తీవ్ర సంక్షోభంలోనూ అద్భుతమైన సేవలను అందించిన విషయాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. రాష్ట్రంలో ప్రజలు పార్టీకి ప్రతిపక్షంగా బాధ్యత ఇచ్చిన తర్వాత హైదరాబాద్ నగరంలో ఉన్న కార్పొరేటర్లు ఎప్పటికప్పుడు ప్రజా సమస్యలపై పోరాటం చేసిన తీరును అభినందించారు. మొన్నటికి మొన్న జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కార్పొరేటర్లు బాధ్యతా యుతంగా ఎన్నికలను పోరాడిన విధానంపై అభినందనలు తెలిపారు. పార్టీ వెంటే నిలబడిన ప్రతి ఒక్క కార్పొరేటర్‌కి భవిష్యత్తులో మరిన్ని పదవులు వస్తాయని హామీ ఇచ్చారు. కార్పొరేటర్లు భవిష్యత్తులో జరిగే ఎన్నికను తమ ఎన్నికగా తీసుకొని పార్టీ అందరినీ తిరిగి గెలిపించుకుంటుందని భరోసా ఇచ్చారు. కార్పొరేటర్లకి రానున్న కాలంలో మహిళా రిజర్వేషన్లు, నియోజకవర్గాల పునర్విభజన వంటి అంశాల నేపథ్యంలో మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు.

# వర్కింగ్ జర్నలిస్టుల చట్టాల రద్దు అప్రజాస్వామ్యం

## కేంద్ర కార్మిక శాఖ కార్యాలయం ముందు టీడబ్ల్యూజేఎఫ్, హెచ్‌యూజే ధర్నా

## – చట్టాల పునరుద్ధరణ చేసేవరకు పోరుబాట: ఫెడరేషన్ నాయకులు రాంచందర్ బసవపున్నయ్య


**ఏ ఎం న్యూస్ /హైదరాబాద్ :** కార్మిక చట్టాలను రద్దుచేసి కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లను ఉపసంహరించుకునేంతవరకు కార్మికులు, జర్నలిస్టులు పోరాటం చేయాలని జర్నలిస్టుల సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం హైదరాబాద్ విద్యానగర్? లోని కేంద్ర కార్మిక శాఖ కార్యాలయం ముందు తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్), హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (హెచ్ఐయూజే) ఆధ్వర్యంలో కార్మిక చట్టాల రద్దుకు వ్యతిరేకంగా జర్నలిస్టులు ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భారీ సంఖ్యలో జర్నలిస్టులు హాజరయ్యారు. లేబర్ కోడ్లను రద్దు చేయాలని, జర్నలిస్టుల ఐక్యత జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు. దాదాపు రెండు గంటలపాటు ధర్నా జరిగింది. ఈ ధర్నాకు ఫెడరేషన్ అడ్ హక్ కమిటీ కన్వీనర్ పి. రాంచందర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులను గాలికొదిలేసి కార్పొరేట్లకు అనుకూలంగా కేంద్రం వ్యవరిస్తున్నద న్నారు. ఎన్నో పోరాటాలు, త్యాగాలు చేసి సాధించుకున్న కార్మిక




చట్టాలను రద్దుచేయడం అన్యాయమని చెప్పారు. వెంటనే లేబర్ కోడ్ల నోటిఫికేషన్‌ను ఉపసంహరించుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి బి. బసవపున్నయ్య మాట్లాడుతూ... ఉన్న రెండు వర్కింగ్ జర్నలిస్ట్ చట్టాలను రద్దుచేయడాన్ని ఖండించారు. ఇప్పటికే అనేక సమస్యలతో జర్నలిస్టులు ఇబ్బందులు పడుతున్నారీ, కొత్త లేబర్ కోడ్లతో సమస్యలు జటిలమవుతాయని అన్నారు. జర్నలిస్టులు ఇప్పటికే కోడ్లు విఘాతంగా మారాయని వ్యాఖ్యానించారు. ధర్నా అనంతరం సెంట్రల్ డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ బిశ్వ భూషణ్ పృష్టికి ఫెడరేషన్ నాయకులు వినతిపత్రం అందజేశారు.

కార్మికులకు జీవన్మరణ సమస్య: జె వెంకటేష్

జర్నలిస్టులనుద్దేశించి కార్మిక సంఘం నేత జె వెంకటేష్ మాట్లాడుతూ.. కార్మిక చట్టాలు స్వాతంత్ర్యానికి ముందు నుంచే ఉన్నాయని గుర్తు చేశారు. కొత్త లేబర్ కోడ్లను రాష్ట్ర ప్రభుత్వం వ్యతిరేకిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. వేతనాలను నిర్ణయించే అధికారం యాజమానులు, ప్రభుత్వాల చేతుల్లో లేబర్కోడ్ ద్వారా పెట్టారని చెప్పారు. కనీస వేతనం రూ.26 వేలు కూడా ఇవ్వకుండా కార్మికులకు అన్యాయం చేస్తు న్నారని విమర్శించారు. ఇప్పుడున్న 8 పనిగంటల పనివిధానం పోయి 12 నుంచి 16 గంటల వరకు పెరుగుతుందని వివరించారు. ఓవర్టైమ్పై నిబంధనలు రూపొందించలేదని చెప్పారు. ఉద్యోగ భద్రతకు గ్యారంటీ లేదని చెప్పారు. ఈఎస్ఐ, పీఎఫ్ నిర్వహించడానికి కేంద్ర ప్రభుత్వం చేతులేత్తేసిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వై. ప్రభాకర్, గుడిగ రఘు, బి. రాజశేఖర్, జి. మాణిక్ ప్రభు, కార్యదర్శులు ఈ చంద్రశేఖర్, గంద్ర నవీన్, దామోదర్, కార్యవర్గ సభ్యులు మణిమాల, హరిప్రసాద్, మేకల కృష్ణ, మధుకర్, రమేష్, సైదులు, హెచ్ యూజే అధ్యక్షులు బి అరుణ్ కుమార్, కార్యదర్శి బి. జగదీశ్వర్, హెచ్ యూజే నాయకులు లలిత, రమాదేవి, రత్నాకర్, తలారీ శ్రీనివాసరావు, ప్రతాప్, జీవన్ రెడ్డి, రమేష్, కాలేబు, సర్వేశ్వర్ రావు, బ్రహ్మం, రాము, రవి తదితరులు పాల్గొన్నారు.



# ప్రయాణికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నాం

## – జిఎం సంజయ్ కుమార్ శ్రీవాత్సవ్

**ఏ ఎం న్యూస్ ఓయూ:** ప్రయాణికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యతను ఇస్తున్నట్టు జిఎం సంజయ్ కుమార్ శ్రీవాత్సవ్ వెల్లడించారు. సోమవారం సికింద్రాబాద్ నుండి రైలు నిలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పలు అంశాలపై ఉన్నతాధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ సికింద్రాబాద్ రైల్ నిలయం నుంచి అదనపు జీఎం సత్య ప్రకాష్‌తో కలిసి రైలు కార్యకలాపాల భద్రత మరియు శీతాకాల సంసిద్ధతపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆరు డివిజన్లకు చెందిన డీఆర్ఎంలు, వివిధ శాఖల ప్రధానాధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. జీఎం రైల్వే కార్యకలాపాల్లో కీలక వనరుల స్థితి, భద్రతా పరికరాల మన్నికదనం, క్రూ మేనేజ్‌మెంట్, గేట్‌మెన్, షంటింగ్ కార్యకలాపాల్లో ఖచ్చితత్వం, చిన్నపాటి లోపాలను కూడా నిర్లక్ష్యం చేయకుండా సమగ్ర మూలకారణ విశ్లేషణ చేయాల్సిన అవసరాన్ని ప్రత్యేకంగా నొక్కి చెప్పారు. క్షేత్రస్థాయి పర్యవేక్షణలో %ఊూ% ట్రాకర్ల వినియోగాన్ని పెంచాలని సూచించారు. సమీక్షకు ముందు, సికింద్రాబాద్, హైదరాబాద్, విజయవాడ, గుంటూరు, గుంతకల్లు, నాందేడ్ డివిజన్లకు చెందిన 16 మంది ఉద్యోగులకు "ఎంప్లాయీ ఆఫ్ ది మంత్" భద్రతా అవార్డులను జీఎం అందజేశారు. గూడ్స్/ట్రైన్ మేనేజర్లు, లోకో పైలట్లు, పాయింట్స్‌మ్యాన్, ట్రాక్ మెయింటెనర్ల వంటి వర్గాల్లో ఉన్న అవార్డు గ్రహీతలను ఆయన అభినందించి, వీరి సేవలు ఇతర ఉద్యోగులకు ప్రేరణగా నిలుస్తాయని తెలిపారు.




## ప్రధాన న్యాయమూర్తిగా

# జస్టిస్ సూర్యకాంత్ ప్రమాణం

**ఏఎం న్యూస్, న్యూఢిల్లీ,నవంబరు 24:** భారతదేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు 53వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సూర్యకాంత్ ప్రమాణస్వీకారం చేశారు. రాష్ట్రపతి భవన్‌లో సోమవారంనాడు జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆయన చేత ప్రమాణస్వీకారం చేయించారు. ఆదివారంనాడు పదవీ విరమణ చేసిన సీజేఐ బిఆర్ గవాయ్ స్థానంలో జస్టిస్ సూర్యకాంత్ బాధ్యతలు స్వీకరించారు. 2027 ఫిబ్రవరి 9వ తేదీ వరకూ ఆయన ఈ పదవిలో కొనసాగనున్నారు. సీజేఐగా బాధ్యతలు చేపట్టిన తొలి హరియాణా వాసిగా జస్టిస్ సూర్యకాంత్ రికార్డు సృష్టించారు. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో తొలిసారిగా భూటాన్, కెన్యా, మలేసియా, మారిషస్, నేపాల్, శ్రీలంక దేశాల చీఫ్ జస్టిస్‌లు వారి కుటుంబ సభ్యులతో కలిసి హాజరుకావడం విశేషం. జస్టిస్ సూర్యకాంత్ 1962 ఫిబ్రవరి 10న హరియాణాలోని హిసార్‌లో ఓ మధ్యతరగతి కుటుంబంలో జన్మించారు. 1984లో రోహ్‌తక్‌లోని మహర్షి దయానంద్ యూనివర్శిటీ నుంచి న్యాయశాస్త్ర పట్టా పొందారు. 2004 జనవరి 9న పంజాబ్, హర్యానా హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2018లో హిమాచల్ ప్రదేశ్ హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా నియమితులయ్యారు. 2019 మే 24న సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. వివిధ ధర్మాసనాల్లో పలు కీలక తీర్పుల్లో ఆయన భాగమయ్యారు. 370వ అధికరణను రద్దు చేస్తూ చారిత్రక తీర్పు ఇచ్చిన ధర్మసనంలో ఉన్నారు. బిహార్ ఎన్నికల జాబితా రివిజన్, పెగాసస్ స్పైవేర్ తీర్పులు కూడా ఉన్నాయి. ఈ కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ, రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, మాజీ సీజేఐ జస్టిస్ గవాయ్, కేంద్రమంత్రులు, ఇతరులు పాల్గొన్నారు.

# నేడు అయోధ్యలో ప్రధాని మోడీ పర్యటన

**ఏఎం న్యూస్, అయోధ్య,నవంబరు 24:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మంగళవారం అయోధ్యలో పర్యటించనున్నారు. ఇక్కడి రామ జన్మభూమి మందిర్‌ను దర్శించనున్నారు. రామాలయ నిర్మాణం పూర్తయినందుకు సంకేతంగా శ్రీరామజన్మ భూమి మందిర శిఖరంపై పతాకాన్ని ఆయన ఆవిష్కరిస్తారు. ఈ ఘట్టం దేశ సామాజిక-సాంస్కృతిక-ఆధ్యాత్మిక ప్రయాణంలో మరో మైలురాయిగా పేర్కొంటున్నారు. ఇదేరోజు మార్గశిర మాసంలోని శుక్లపక్షంలో వచ్చే పంచమి కావడం, ఇదే అభిజిత్ ముహూర్తంలో సీతారాముల వివాహ పంచమి కూడా కావడం విశేషం. సిక్కుల తొమ్మిదవ గురువు గురుతేజ్ బహదూర్ ఆత్మబలిదాన దినోత్సం కూడా ఇదే రోజు వస్తోంది. 17వ శతాబ్దంలో అయోధ్యలో గురుతేజ్ బహదూర్ 48 గంటల సేపు ధ్యానం చేశారు. ప్రధానమంత్రి మంగళవారం ఉదయం 10 గంటలకు వశిష్ట, విశ్వామిత్ర, అగస్త్య, వాల్మీకి, దేవి అహల్య, నిషదరాజు గుహుడు, శబరి మాత మందిరాలతో కూడిన సప్తమందిర్‌ను దర్శిస్తారు. 11 గంటలకు శేషావతార్ మందిర్, మాతా అన్నపూర్ణ మందిరాలను దర్శించుకుంటారు. రామ దర్బార్ గర్భగృహం, రామలీలా గర్భగృహంలో పూజల్లో పాల్గొంటారు. మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో శ్రీ రామజన్మ భూమి మందిర్ శిఖరంపై కాషాయం రంగు పతాకాన్ని ప్రధాని ఆవిష్కరిస్తారు. ఈ సందర్భంగా రామరాజ్యం ఆదర్శాలు, జాతీయ సమైక్యత, భారతదేశ సమున్నత వారసత్వంపై ప్రధాని ప్రసంగిస్తారు. రామమందిరానికి సహాయం చేసిన దాతలను ఈ వేడుకలకు అధికారికంగా ఆహ్వానించనున్నట్టు ట్రస్ట్ ఇప్పటికే ప్రకటించింది. దేశం నలుమూలల నుంచి సుమారు 8000 మంది ఆహ్వానితులు ఈ ధ్వజారోహణ కార్యక్రమంలో పాల్గొంటారని అంచనా వేస్తున్నారు.

# నిరంజన్ రెడ్డి అవినీతితోనే ఓడారు


**ఏఎం న్యూస్, హైదరాబాద్,నవంబరు 24:** బిఆర్ఎస్ నేత, మాజీ మంత్రి నిరంజన్ రెడ్డిపై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. మాజీ మంత్రి చేసిన అవినీతికి వనపర్తి నియోజకవర్గంలో బీఆర్ఎస్‌కు కోలుకోలేని దెబ్బపడిందని వ్యాఖ్యలు చేశారు. ఆయన మూడు నాలుగు ఫామ్‌హౌస్‌లు కట్టుకున్నారని.. చెప్ప లేనంత అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. ఎమ్మార్వో ఆఫీస్‌ను కాల్చేస్తే కూడా ప్రజలు ఏమి చేయలేని నిస్సహాయ స్థితిలో ఉన్నారని.. ఎదురు తిరిగిన 32 మందిపై పోలీసులు కేసులు నమోదు చేసి జైలుకు పంపారంటూ మాజీ మంత్రిపై ఫైర్ అయ్యారు. ఇలాంటి అవినీతిపరుడిని చిత్తుగా ఓడించడం సరైన నిర్ణయమన్నారు. వనపర్తి నియోజకవర్గంలో నిరంజన్ రెడ్డి రాచరిక పాలనను తలపించారని విమర్శించారు. ఒక్క ఎకరాకు కూడా నీళ్లు ఇవ్వని నిరంజన్ రెడ్డి తనకు తాను నీళ్ల నిరంజనుడుగా పేరు మార్చుకున్నారంటూ ఎద్దేవా చేశారు. 'నా గురించి ఇంకొక్కసారి ఎక్కడైనా మాట్లాడితే నీ తాట తీస్తా ఒళ్ళు జాగ్రత్తగా పెట్టుకో' అంటూ నిరంజన్ రెడ్డికి కవిత ఘాటుగా వార్నింగ్ ఇచ్చారు.

# కోకాపేటలో తిరగరాసిన రికార్డులు

**ఏఎం న్యూస్, హైదరాబాద్,నవంబరు 24:** హైదరాబాద్ కోకాపేటలో ప్లాట్లు రికార్డు ధర పలికాయి. నియోపోలిస్ దగ్గర రికార్డు స్థాయిలో ప్లాట్లు అమ్ముడుపోయినట్లు తెలుస్తోంది. ఎకరం ధర రూ.137.25 కోట్లు పలికి రికార్డు సృష్టించింది. గత రికార్డులను ఇది తిరగరాసింది. అధికారులు ప్లాట్ నెంబర్ 17, 18కి ఈ వేలం నిర్వహించారు. అధికారిక సమాచారం ప్రకారం.. ప్లాట్ నెం. 17లో 4.59 ఎకరాలు ఉండగా ఈ వేలంలో ఎకరానికి రూ. 136.50 కోట్లు పలికింది. ప్లాట్ నెం 18లో 5.31 ఎకరాలు ఉండగా ఎకరానికి రూ.137.25 కోట్లు పలికింది. వేలంలో 9.90 ఎకరాలకుగాను ఊఓఆంకి రూ.1,355. 33 కోట్లు ఆదాయం వచ్చినట్లు తెలుస్తోంది. కోకాపేటలో మిగిలిన భూములను నవంబర్ 28వ తేదీన అధికారులు వేలం వేయనున్నారు. కాగా, నియోపోలీస్ లేఅవుట్‌లో అంతర్జాతీయ స్థాయి సౌకర్యాలు అందుబాటులో ఉండటంతో దిగ్గజ రియల్ ఎస్టేట్ సంస్థలు పెద్ద ఎత్తున పోటీపడుతు న్నాయి. అంతేకాకుండా, ఇక్కడ ఎన్ని అంతస్తులు నిర్మించాలన్నదానిపై పరిమితి కూడా లేదని తెలుస్తోంది. ఫ్లోర్స్ విషయంలో లిమిట్ లేకపోవడంతో కమర్షియల్, రెసిడెన్షియల్ ప్రాజెక్టులు నిర్మించుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ప్రాజెక్ట్ అటు ఓఆర్ఆర్‌కు ఇటు రాయదుర్గం ఐటి కంపెనీలకు దగ్గరగా ఉండటంతో కోకాపేట భూముల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి.

## బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్‌గా కుందారం గణేష్ చారి

**ఏ ఎం న్యూస్ ఓయూ:**



హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్‌గా కుందారం గణేష్ చారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం కాచిగూడ లో జాజుల శ్రీనివాస్ గౌడ్ నేతృతంలో జేఏసీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, మధు యాష్కి గౌడ్, వి హనుమంతరావు, సినీ దర్శకుడు శంకర్, జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, ప్రొఫెసర్ బాగయ్య హాజరై జేఏసీ చైర్మన్ గా ఎన్నికైన కుందారం గణేష్ చారి కి నియామక పత్రాన్ని అందజేసి శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో శ్యాం కుర్మా, తాటికొండ విక్రమ్ గౌడ్, కులకచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, మణి మంజరి సాగర్, శ్రీధర్, పిట్ల నాగేష్, నరసింహ, వీరన్న, నరసింహాచారి తదితరులు పాల్గొన్నారు.

## సర్వమానవాళికి క్రీస్తు మార్గం అనుసరణీయం

**–పాల్సనారాజు**

**ఏ ఎం న్యూస్ ఓయూ:**



యేసు క్రీస్తు చూపిన ప్రేమ మార్గము సర్వమానవాళికి అనుసరణీయమైని కరుణాపురం క్రీస్తు జ్యోతి ప్రార్థన మందిరం వ్యవస్థాపకులు రెవరెండ్ పాల్సన్ రాజు అన్నారు. ఈ మేరకు ఆదివారం రాత్రి తార్నాకలోని సౌతాలాలాగూడ బాప్టిస్టు చర్చి సెంటినరీ వేడుకల్లో ఆయన ముఖ్యతిధిగా పాల్గొన్నారు. ప్రత్యేక సందేశాన్ని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో రెవరెండ్ జయప్రకాశ్, డా. జోషఫ్ ప్రభాకర్, బిషప్ పిప మోజెస్(ఎంఏ ఎల్ఎల్ బి)ఎ తదితరులున్నారు.

# అధునాతన ఆక్స్ఫర్డ్ కాదు జ్ఞాన బండాగారమైన నలంద కావాలి

## – ఏబీవీపీ

ఏ ఎం న్యూస్ ఓయూ:
అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఉస్మానియా యూనివర్సిటీ శాఖ ఆధ్వర్యంలో ఉస్మానియా యూనివర్సిటీలోని ఠాగూర్ ఆడిటోరియంలో ఓయూ సమగ్ర అభివృద్ధికై విద్యార్థి సమాలోచన సభ పేరుతో సభ నిర్వహించారు. ఈ సభలో విద్యార్థి నాయకులు, విద్యార్థులు యూనివర్సిటీ అభివృద్ధి సమాలోచనపై మాట్లాడుతూ గత 10 సంవత్సరాల కాలంలో ఏ ప్రభుత్వం చొరవలేక విశ్వవ్యాప్త విద్యాలయం ఉస్మానియా నిర్వీర్యపోయింది. కొత్తగా ఏర్పడ్డ ప్రభుత్వం ముఖ్యమంత్రివర్యులు రేవంత్ రెడ్డి ఉస్మానియా యూనివర్సిటీని పర్యటించి 1000 కోట్లు ఇస్తా అనడాన్ని విద్యార్థి పరిషత్ నాయకులు విద్యార్థులు అందరం స్వాగతిస్తున్నాం కానీ ఉస్మానియా యూనివర్సిటీ విషయమై చర్చిస్తూ ప్రతి నాయకుడు ఆక్స్ఫర్డ్, స్టాన్ఫోర్డ్, హార్వర్డ్ యూనివర్సిటీలతో పోల్చడం కన్నా వాటి లాగ అభివృధి కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని 80 దేశాలకుపైగా అంతర్జాతీయ విద్యార్థులకు ఆతిథ్యం ఇస్తూ, దక్షిణ భారత దేశంలోనే అతిప్రాచినమైన యూనివర్సిటీ గా వెలుగొందితూ, విద్యాభ్యాసానికి దిక్సూచిగా ఉన్నటువంటి ఉస్మానియా యూనివర్సిటీ, నలంద, తక్షశిలా విశ్వవిద్యాలయాల్లా న బండా గారంగా తీర్చిదిద్దేందుకు ముందుగా ఫ్యాకల్టీ రిక్రూట్మెంట్ తో




మొదలుపెట్టి ప్రతి డిపార్ట్మెంట్ లో అధునాతన హంగులతో క్లాస్ రూమ్ నుండి మొదలుకొని లాబ్ ఎక్విప్మెంట్స్, కాలేజ్ బిల్డింగ్స్, హాస్టల్ బిల్డింగ్స్, స్పోర్ట్స్ ఎక్విప్మెంట్స్ మాత్రమే కాకుండా AI టెక్నాలజీతో పోటీపడుతున్న ప్రస్తుత పోటీ ప్రపంచానికి అనుగుణంగా యూనివర్సిటీలో చదివే విద్యార్థులకు ఉద్యోగ అవకాశాల కోసం ప్లేస్మెంట్స్ కల్పించాలని, యూనివర్సిటీలో చదివే విద్యార్థులకు రూపాయి ఖర్చు లేకుండా హాస్టల్ మరియు మెస్ వసతులు కల్పించాలని, T - HUB లాగ OU - HUB స్థాపించి సాఫ్ట్వేర్ రంగంలో కూడా విద్యార్థులను తీర్చిదిద్దే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు యూనివర్సిటీ అధికారులు తమకు నచ్చిన వారి సలహాలతో తయారు చేసిన DPRని కాకుండా విద్యార్థులందరిని భాగస్వామ్యం చేస్తూ యూనివర్సిటీ అభివృద్ధి ఎజెండాతో విద్యార్థి పరిషద్ తయారు చేసిన DPR ని కూడా పరిగణలోకి తీసుకోవాలని తెలియజేశారు. ఒకవేళ ముఖ్యమంత్రి గారు ప్రకటించినటువంటి 1000 కోట్లు ఇవ్వకపోతే విద్యార్థి పరిషద్ ఉద్యమానికి ప్రణాళిక సిద్ధం చేస్తుందని తెలియజేశారు.

# శ్రీ కృష్ణా నగర్ హనుమాన్ మందిరంలో మొదలైన అన్నప్రసాద కార్యక్రమం

## – పాల్గొన్న కమిటీ సభ్యులు..

ఏ ఎం న్యూస్, జూబ్లీహిల్స్ :
ఎంతో నిష్ఠగా మాలలు వేసుకొని అయ్యప్ప పూజ చేసే అయ్యప్ప స్వాముల కోసం శ్రీ శ్రీ శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి, ( హనుమాన్ టెంపుల్ గా పిలవబడే), శ్రీ శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి ఆలయ ప్రాంగణం శ్రీకృష్ణ నగర్( జూబ్లీహిల్స్ నియోజక వర్గం డివిజన్ పరిధిలోని )లో ఉన్న ఆలయంలో గత కొన్ని సంవత్సరాల నుండి ప్రత్యేక అన్నదాన కమిటీ ఏర్పాటు చేసి అన్న ప్రసాద (అన్నదానం కార్యక్రమం) కార్యక్రమం నిర్వహిస్తూ వస్తున్నారు కమిటీ సభ్యులు. ఈ క్రమంలో భాగంగా ఈ ఏడు (2025) నవంబర్ 24 వ తారీకు సోమవారం ఆలయ కమిటీ అధ్యక్షులు ఈ.ఎల్ రామయ్య తో పాటు, కమిటీ సభ్యులు పాల్గొని ఆలయ ప్రాంగణంలో ప్రధాన పంతులు కృష్ణమాచారిచే జరిపిన ప్రత్యేక అభిషేకాలలో పాల్గొని వినాయకుని కృపకు పాత్రులు అయ్యారు. మధ్యాహ్నం ప్రత్యేక అన్నదాన కమిటీ సభ్యుల సమక్షంలో వైజాగ్ నుండి వచ్చిన నాగేశ్వరరావు గురు స్వామి చే జరిపిన అయ్యప్ప స్వామి పూజలో పాల్గొని అన్నప్రసాద కార్యక్రమాన్ని అయ్యప్ప స్వాముల మధ్య ఘనంగా ప్రారంభించారు ఆలయ కమిటీ సభ్యులు. మొదటి రోజు జరిగిన అన్నప్రసాద కార్యక్రమానికి దాత అయిన పెండ్యాల గోత్రం సుధాకర్ రెడ్డి కి శాలువాతో ఘనంగా సన్మానించి అయ్యప్ప స్వామి ప్రసాదాన్ని అందజేశారు ఆలయ కమిటీ సభ్యులు. సుధాకర్ రెడ్డి తో హరి అని చెప్పి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు ఈ కార్యక్రమంలో వారి కుటుంబ సభ్యులు మల్లారెడ్డి, నవనీత, వెంకటమ్మ, అనుదీప్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి పాల్గొని అయ్యప్ప స్వామి కృపకు పాత్రులు అయ్యారు. ఆలయ కమిటీ సభ్యులు నరసింహులు మాట్లాడుతూ దాతల సహకారంతో ఈ అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామని, దాతలు లేని రోజు ఆలయ కమిటీ చే అన్న దాన కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. కమిటీ సభ్యులైన వి. కనకయ్య గౌడ్ మాట్లాడుతూ ఈ రోజు(నవంబర్ 24) నుండి డిసెంబర్ 31 (2025)వ తారీకు వరకు ఈ అన్నదాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. సభ్యులు శ్యాంబాబు యాదవ్ మాట్లాడుతూ భక్తితో నిష్టగా ఈ అన్నదాన కార్యక్రమం మేము(



ఆలయ కమిటీ సభ్యులు) నిర్వహిస్తామని తెలిపారు సభ్యులు శాసనాల గాలయ్య మాట్లాడుతూ దాతలు ఎంతో సహకరిస్తూ ఈ అన్న ప్రసాద( అన్న దానం) కార్యక్రమంలో భాగమవుతున్నారని అన్నారు ఈకార్యక్రమంలో కమిటీ సభ్యులు మన్మోహన్, సుధాకర్ పాల్గొన్నారు ఓం శ్రీ స్వామియే శరణమయ్యప్ప అంటూ అయ్యప్ప స్వాములు చేసిన ప్రార్థనలతో ఆలయ ప్రాంగణం భక్తి నినాదం తో మారు మోగిపోయింది. ఈకార్యక్రమంలో శంకర్ పాల్గొన్నారు.

# కళ్యాణ మహోత్సవంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనండి

## - అధ్యక్షులు ఈ. ఎల్. రామయ్య..

ఏ ఎం న్యూస్, జూబ్లీహిల్స్ :
స్వస్తిశ్రీ విశ్వ వసునామ సంవత్సర మార్గశిర మాష షష్టి స్కంద షష్టి బుధవారం (26 11 2025 ) సుబ్రమణ్య స్వామి వారి జన్మదిన సందర్భంగా శ్రీ వల్లి దేవసేన సహిత సుబ్రమణ్య స్వామి వారి కళ్యాణం మహోత్సవం ను శ్రీ శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి ( శ్రీకృష్ణ నగర్ హనుమాన్ టెంపుల్ గా పిలవబడే )శ్రీ శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి వారి ఆలయ ప్రాంగణం( జూబ్లీహిల్స్ నియోజకవర్గం యూసుఫ్ గూడా డివిజన్ శ్రీకృష్ణ నగర్ లో ఉన్న) లో బుధవారం (26/11/2025) సాయంత్రం కళ్యాణ సుముహూర్తము అయిన ఏడు గంటలకు( సాయంత్రం) ఆలయ ప్రాంగణంలో ఘనంగా జరుపుతున్నామని ఆలయ కమిటీ అధ్యక్షులు ఈ. ఎల్. రామయ్య జూబ్లీహిల్స్ ఏ.ఎమ్.న్యూస్ ద్వారా తెలిపారు ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని మీడియా ద్వారా కోరుతున్నారు ఆలయ అధ్యక్షులు ఈ.ఎల్. రామయ్య. శ్రీవల్లి దేవసేన సహిత సుబ్రమణ్య స్వామి వారి కళ్యాణ మహోత్సవం జరిపించు పుణ్య దంపతులు చందు పెద్ద వీరయ్య, సరళ దేవి తో పాటు మాదిరెడ్డి కృష్ణ చైతన్య, డాక్టర్ సుష్మ అని తెలిపారు ఈ కళ్యాణ మహోత్సవానికి అభిషేకము వంద రూపాయలు (100), సాయంత్రం జరిగే కళ్యాణం టికెట్టు నాలుగు వందల (400) రూపాయలు ఆలయ కమిటీ సభ్యుల నిర్ణయం మేరకు నిర్ణయించామని,



ఎవరైనా తీసుకొని వారు ఈ కళ్యాణ మహోత్సవ టికెట్ను తీసుకోవాలని అన్నారు . ఆలయ కమిటీ సభ్యులచే ఈ కళ్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు భక్తులందరూ స్వామివారి అభిషేకము, సాయంత్రం జరిగే కళ్యాణంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కాగలరని కోరుతున్నామని అన్నారు. రామయ్య మాట్లాడుతూ గత సంవత్సరము ఈ కళ్యాణంలో పాల్గొన్న వారికి వివాహము సంతానం కలిగిందని సంతోషంగా భక్తులే స్వయంగా చెప్పిన విషయం మీడియా ద్వారా వెల్లడిస్తున్నామని అన్నారు. ఈ సమావేశంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# 76వ రాజ్యాంగం దినోత్సవ సంబురాలు

### ఉస్మానియా ఆర్ట్స్ కాలేజీలో ఘనంగా 76వ రాజ్యాంగ దినోత్సవ సంబరాలు

ఏ ఎం న్యూస్/ హైదరాబాద్:



నవంబర్ 26న జరగనున్న 76వ భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని, ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీలోని పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం ఆధ్వర్యంలో సోమవారం (నవంబర్ 24) పలు ప్రత్యేక కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సి. కాశీం పర్యవేక్షణలో మరియు విభాగాధిపతి ప్రొఫెసర్ సి. అరుణ జ్యోతి నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రిటైర్డ్ ప్రొఫెసర్ పి. మోహన్ రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సి. కాశీం మాట్లాడుతూ.. రాజ్యాంగంలో వచ్చిన మార్పులు, క్విజ్ పోటీల ద్వారా విద్యార్థులలో రాజ్యాంగంపై అవగాహన పెంచాల్సిన ఆవశ్యకతను వివరించారు. అనంతరం ముఖ్య అతిథి ప్రొఫెసర్ పి. మోహన్ రావు.. ప్రజాస్వామ్య సంస్థలు, రాజ్యాంగ వికాసం మరియు ప్రస్తుత రాజ్యాంగ స్థితిగతులపై ప్రసంగించి విద్యార్థులలో స్ఫూర్తి నింపారు. ఈ వేడుకల్లో భాగంగా 'భారత రాజ్యాంగం' అనే అంశంపై క్విజ్, వ్యాసరచన మరియు ఉపన్యాస పోటీలను నిర్వహించారు. ఇందులో పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విద్యార్థులతో పాటు, యూనివర్సిటీలోని ఇతర విభాగాల విద్యార్థులు కూడా అత్యంత ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డా. ఎం. హరిత, ఎస్.ఆర్.ఎఫ్ (%ూ=ఖీ%) స్కాలర్స్ హరీష్ కుమార్, మంచాల కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. నవంబర్ 26న విద్యార్థుల ఆధ్వర్యంలో 'రాజ్యాంగం మరియు పరిపాలనలో అభివృద్ధి' అనే అంశంపై ప్రత్యేక ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని అత్యంత విజయవంతంగా నిర్వహించినందుకు పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ ప్రథమ మరియు ద్వితీయ సంవత్సర విద్యార్థులను కాలేజీ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సి. కాశీం, ముఖ్య అతిథి ప్రొఫెసర్ పి. మోహన్ రావు మరియు విభాగాధిపతి ప్రొఫెసర్ సి. అరుణ జ్యోతి ప్రత్యేకంగా అభినందించారు.

# రోడ్డుపై అక్రమంగా నిర్మించిన మెట్లను తొలగించాలి

ఏ ఎం న్యూస్ / హైదరాబాద్:



బన్సీలల్పేట్ డివిజన్ న్యూ బోలాక్పూర్, కృష్ణానగర్ ప్రాంతంలోని ఎల్లమ్మ దేవాలయానికి అనుకొని ఉన్న ఓ ఇంటి యజమాని అక్రమంగా నిర్మిస్తున్న మెట్లు తొలగించాలని బస్తీవాసులు జిహెచ్ఎంసి డిప్యూటీ కమిషనర్ డాకు సింగ్ కు సోమవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బస్తి వాసులు మాట్లాడుతూ బస్తీలలో వెలిసిన నల్ల పోచమ్మ, ఎల్లమ్మ దేవాలయానికి సమీపంలో అక్రమంగా రోడ్డుపై ఇనుపమెట్లను ఏర్పాటు చేయడం ద్వారా ఈ ప్రాంతంలో రాకపోకలు సాగించే బస్తీ వాసులు తీవ్ర ఇబ్బందులు



పడుతున్నారని, దేవాలయాలకు వచ్చే భక్తులకు తీవ్ర అసౌకర్యం కలుగుతున్నదని మున్సిపల్ అధికారులు తక్షణమే స్పందించి రోడ్డుపై అక్రమంగా నిర్మించిన మెట్లను తొలగించాలని డిమాండ్ చేశారు. అసలే ఇరుకు రోడ్లు ఆపై రోడ్డుమీద అక్రమంగా మెట్లను ఏర్పాటు చేయడం ద్వారా ఎల్లమ్మ నల్ల పోచమ్మ దేవాలయాలకు వచ్చే భక్తులకు తీవ్ర అసౌకర్యం కలుగుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అశోక్, అనిల్ కుమార్,హరినాథ్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు

### రౌడీయిజం గుండాయిజం చలాయిస్తూ

# ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న ఎమ్మెల్యే..

## ఎమ్మెల్యే కృష్ణారావు పై ధ్వజమెత్తిన కూకట్పల్లి కాంగ్రెస్ శ్రేణులు...

ఏ ఎం న్యూస్, కూకట్పల్లి :
తప్పుడు హామీలు ప్రత్యర్థి పార్టీల మీద తప్పుడు ప్రచారాలూ చేస్తూ 56 వేల దొంగ ఓట్లతో కూకట్పల్లి ఎమ్మెల్యేగా 3 మార్లు గెలిచి ప్రజలను మభ్యపెట్టి రాజకీయం చేస్తున్న మాధవరం కృష్ణారావుతో విసుగు చెంది ఆయనను నమ్ముకుంటే గత పది సంవత్సరాలుగా ఒక్క రేషన్ కార్డు ఒక్క డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ఒక్క ఎస్సీ ఎస్టీ లోన్ కూడా రాలేదని ఆయనతో ఉంటే తమకు సామాజికాభివృద్ధి జరగదని ఇలాంటి మోసపూరిత రాజకీయ నాయకున్ని నమ్ముకుని సర్వం కోల్పోయామని గ్రహించి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎస్సీ ఎస్టీ బిసి మైనార్టీ కులాలకు అత్యంత న్యాయం జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత పేదలకు రేషన్ కార్డులు, రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యం, అలాగే ప్రతీ పేద ప్రజల ఇంటికి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం, గ్యాస్ ధరలు 500 రూపాయల సబ్సిడీ, లాంటి ఎన్నో ప్రజా సంక్షేమ పథకాలను అందిస్తున్న రేవంత్ రెడ్డికి అండగా ఉండాలని తీర్మానం చేసి ఆదివారం ఫతేనగర్ డివిజన్ లోని అమృత్ నగర్ తండా అధ్యక్షుడు సీనియర్ బీఆర్ఎస్ పార్టీ నాయకుడు గౌడ్ నాయక్ తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు కూకట్పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ ని వారి తండాకు ఆహ్వానించి తండా లోని ఇతర నాయకులతో కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. అయితే ఇది తెలుసుకున్న కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు రాత్రికిరాత్రి తన గూండాలు రౌడీలను రంగంలోకి దింపి సదరు నాయకులను బెదిరించి వారు తిరిగి బీఆర్ఎస్ పార్టీలో తన సమక్షంలో చేరి అందరి సమక్షంలో జరిగిందంతా అబద్ధమని చెప్పమని తీవ్ర వత్తిడి చేసి వారిని రాత్రంతా నిద్ర లేకుండా వేధించి బెదిరింపులకు గురి చేసి సోమవారం ప్రొద్దున వారిని ఆయన క్యాంప్ కార్యాలయంలో బలవంతంగా బీఆర్ఎస్ పార్టీలో చేర్చుకోవడం విడ్డూరం అని కాంగ్రెస్ రైలు అన్నారు. గౌడ్ నాయక్ స్వయానా బండి రమేష్ కార్యా



లయానికి వచ్చి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకొని తదనంతరం రమేష్ ని గౌడ్ నాయక్ స్వయంగా అమృత్ నగర్ కి తీసుకొని వెళ్లడం వెళ్లే దారిలో భారీగా స్వాగతం పలికి ఊరేగింపుగా వెళ్లి అక్కడ చేసిన సంబరం వీడియోలో చూడవచ్చు అన్నారు. ఇలాంటి రౌడీయిజం గుండాయిజం చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్న ఎమ్మెల్యేను తక్షణం అసెంబ్లీ నుండి బర్తరఫ్ చేయాలని కూకట్పల్లి నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు.

# తెలంగాణ రాజ్యాధికార (టిఆర్ పి)పార్టీ రంగారెడ్డి జిల్లా నూతన కమిటీ నియామకం...

ఏ ఎమ్ న్యూస్, శేర్లింగంపల్లి :



తెలంగాణ రాజ్యాధికార పార్టీ రంగారెడ్డి జిల్లా కమిటీ ఇటీవల ప్రకటించిన కొత్త నియామకాలలో ఎంపికైన నాయకులు పార్టీ ప్రధాన నాయకులు తీన్మార్ మల్లన్నని, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ & ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఇంచార్జి సుధగాని హరిశంకర్ గౌడ్ ని మర్యాదపూర్వకంగా కలిసి తమ నియామక పత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడు అడ్వకేట్ బండారి రమేష్ యాదవ్, జనరల్ సెక్రటరీ కోట్లు వాసుదేవ్, అలాగే ఇతర జిల్లా స్థాయి నాయకులు పాల్గొన్నారు. నాయకులు ఈ సమావేశంలో పార్టీ బలోపేతం, డిజిటల్ విస్తరణ, సోషల్ మీడియా బలోపేతం, అలాగే గ్రామ స్థాయి కార్యకలాపాల వేగవంతం వంటి కీలక అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా తీన్మార్ మల్లన్న కొత్తగా నియమితులైన నాయకులకు పార్టీ భవిష్యత్ కార్యాచరణ, వారి బాధ్యతలు, ప్రజలతో అనుసంధానాన్ని పెంపొందించే కార్యక్రమాలపై స్పష్టమైన మార్గదర్శకాలను అందించారు. బీమాగోని మహేష్ గౌడ్ వర్కింగ్ ప్రెసిడెంట్ , మింగని నర్సింగ్ ముదిరాజ్ వర్కింగ్ ప్రెసిడెంట్, పొనుగోటి సందీప్ ఉపాధ్యక్షుడు, మద్దగుడెం జనార్దన్ ముదిరాజ్ ఉపాధ్యక్షుడు, బొంగు వెంకటేష్ గౌడ్ అధికార ప్రతినిధి,సబ్బరి గారి రాజు అధికార ప్రతినిధి, శాగంటి శ్రీనివాస్ సహాయక కార్యదర్శి, నారబత్తుల లింగాచార, సహాయక కార్యదర్శి అలే వీరభద్రయ్య, సహాయక కార్యదర్శి తేళ్ల ప్రశాంత్ మీడియా ఇంచార్జి, బండారు విజయలక్ష్మి మహిళా అధ్యక్షురాలు, గుల్ల వాసుకి వర్కింగ్ ప్రెసిడెంట్, వనం పద్మ ఎగ్జిక్యూటివ్ మెంబర్, దాస్యం మౌనిక కార్యదర్శి, తదితరులు నియమితులయ్యారు..

### ఓటు చోరీని కాంగ్రెస్ శ్రేణులంతా కలిసి

# అడ్డుకొని తీరుతాం... : బండి రమేష్

ఏ ఎం న్యూస్, కూకట్పల్లి :





ప్రజాస్వామ్యానికి పట్టుగొమ్మ అయిన ఓట్ చోరీని ఎట్టి పరిస్థితుల్లో అడ్డుకొని తీరుతామని టిపిసిసి ఉపాధ్యక్షుడు కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బండి రమేష్ పేర్కొన్నారు. ఓటు చోరీ అయ్యే విధానాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని టిపిసిసి ఇచ్చిన పిలుపుమేరకు సోమవారం కూకట్పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ కార్యాలయం హేమ దుర్గా భవన్లో ఇన్చార్జి రమేష్ అధ్యక్షతన బ్లాక్, డివిజన్, యూత్ కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ ఓట్ చోర్ను అడ్డుకునేందుకు ప్రతి కాంగ్రెస్ కార్యకర్త, నాయకుడు గట్టిగా పోరాడాలని ఇంటింటికి తిరిగి కరపత్రాలను పంచుతూ ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని రేపటి నుండే మొదలుపెట్టనున్నట్టు రమేష్ తెలిపారు.

### నియోజకవర్గంలో నెలకొన్న

# సమస్యలను పరిష్కరించే దిశగా తన వంతు కృషి

## టిపిసిసి ఉపాధ్యక్షులు బండి రమేష్

ఏ ఎం న్యూస్, కూకట్పల్లి :



ప్రజలు ప్రస్తావించిన ప్రతి సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషి చేయనున్నట్లు టిపిసిసి ఉపాధ్యక్షుడు, జహీరాబాద్ పార్లమెంటు ఇంచార్జ్ కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం దిశలో అయన కెపిహెచ్బి డివిజన్ పరిధిలోని సి బి సి ఐ డి, ఎన్ ఆర్ ఎస్ ఎ, డైమండ్ హిల్స్, వసంత నగర్ ప్రాంతాల్లో పర్యటించారు. స్థానిక ప్రజలు, అసోసియేషన్లతో సమావేశమై సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయా కాలనీలో నెలకొన్న త్రాగునీరు, డ్రైనేజీ వ్యవస్థ, విద్యుత్ దీపాలు, రాత్రి సమయాల్లో పోలీస్ పెట్రోలింగ్, సర్వీస్ రోడ్లు వంటి సమస్యలను ప్రజలు ప్రస్తావించారు. వసంత నగర్ కాలనీలో ప్లాట్ల రిజిస్ట్రేషన్, సి బి సి ఐ డి కాలనీలో భవన నిర్మాణాలకు అనుమతులపై తలెత్తుతున్న సమస్యలను వారు రమేష్ దృష్టికి తీసుకువచ్చారు. కాగా వీధిదీపాలు తాగునీరు డ్రైనేజీ లాంటి చిన్న చిన్న సమస్యలపై అప్పటికప్పుడే సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడి వెంటనే సమస్య పరిష్కారం కోసం కృషి చేయాలని సూచించారు. ప్లాట్ల రిజిస్ట్రేషన్ విషయమై జిల్లా కలెక్టర్, రెవెన్యూ మంత్రితో మాట్లాడి శాశ్వత పరిష్కారం కోసం ప్రయత్నిస్తానని రమేష్ హామీ ఇచ్చారు. దీనిపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు భాను, మధు, బాబురావు, సుధా తదితరులు పాల్గొన్నారు.

# కూకట్పల్లిలో శుభకార్యాలలో పాల్గొన్న వడ్డేపల్లి రాజేశ్వరరావు

ఏ ఎం న్యూస్, కూకట్పల్లి :



కూకట్పల్లి ఎన్.కే. ఎన్.ఆర్ గార్డెన్స్లో జరిగిన వివాహవిందు (రిసెప్షన్)వేడుకలో దీరజ్ ఆత్మీయ ఆహ్వానం మేరకు బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు హాజరై నూతన వధూవరులైన జనక్, నేహాలను అభినందించి, మీదంపతుల ప్రేమ, పరస్పరగౌరవం, ఆనందంతో నిండి సుఖ సంతోషాలతో వివాహ జీవనంముందుకుసాగించాలనిఆశీర్వదించి,శుభాకాంక్షలు తెలియజేశారు.

### ఎమ్మెల్యే వి. నవీన్ యాదవ్ని ఘనంగా

# సన్మానించిన ఫలాహ్-ఎ- మిల్లత్ ట్రస్ట్ సభ్యులు

ఏ ఎం న్యూస్, జూబ్లిహిల్స్ :



జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి నూతనంగా ఎన్నికైన ఎం.ఎల్.ఎ. ( శాసనసభ్యులు ) వల్లాల నవీన్ యాదవ్ని సోమవారం రాత్రి ఘనంగా సన్మానించారు ఎర్రగడ్డ డివిజన్( జూబ్లీహిల్స్ నియోజకవర్గం) సుల్తాన్ నగర్ ఫలాహ్-ఎ-మిల్లత్ ట్రస్ట్ సభ్యులు. కాంగ్రెస్ పార్టీ గెలుపులో క్రియాశీలక పాత్ర పోషించిన మైనార్టీ సోదరులందరికీ ఎమ్మెల్యే వి నవీన్ యాదవ్ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫజల్ భాయ్, జావీద్ భాయ్, షరీఫ్ ఖాన్, అజీజ్ భాయ్, నయీం భాయ్, దస్తగీర్ భాయ్, ఫర్హత్ ఖాన్, తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. ఈ సన్మాన కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన కొన్ని సూచనలు, సమస్యలను ఎమ్మెల్యే కి వివరించగా, వాటిని ప్రాధాన్యతతో పరిశీలించి విడతల వారిగా అవసరమైన చర్యలు తీసుకుంటానని వి. నవీన్ యాదవ్ వారికి భరోసా ఇచ్చారు.

# ఫిబ్రవరి 13న స్వయంభు విడుదల

## భారీ అంచనాలతో నిర్మాణం

ఒక సినిమా.. రెండు సంవత్సరాల కష్టం.. పదుల సంఖ్యలో సెట్స్.. వేల సవాళ్లు..' అంటూ 'స్వయంభు' విడుదల తేదీని ప్రకటించారు హీరో 'నిఖిల్'. ఆయన ప్రధానపాత్రలో భరత్ కృష్ణమాచారి దర్శకత్వంలో పాన్ ఇండియా స్థాయిలో ఈ చిత్రం రూపొందుతోంది. సంయుక్త, నభా నటేశ్ కథానాయికలు. తాజాగా ఈ సినిమా విడుదల తేదీని ప్రకటించారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 13న విడుదల కానున్నట్లు తెలుపుతూ వీడియో విడుదల చేశారు. హీరో నిఖిల్ సిద్దార్థ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న పీరియడ్ వార్ యాక్షన్ డ్రామా 'స్వయంభు' మరోసారి వార్తల్లోకి వచ్చింది. కొంతకాలంగా చిత్ర బృందం నుంచి ఎలాంటి అప్డేట్ రాకపోవడంతో ఫ్యాన్స్ నిరుత్సాహంలో ఉన్నారు. అయితే , ఈ రోజు మేకర్స్ చిత్రం  విడుదల తేదీని ప్రకటించారు. 'కార్తికేయ 2'తో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన నిఖిల్ ఇప్పుడు మళ్లీ పాన్ వరల్డ్ స్థాయిలో ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమవుతున్నారు. మొదటిసారి దర్శకుడిగా మారుతున్న భరత్ కృష్ణమాచారి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ భారీ యాక్షన్ డ్రామా వచ్చే ఫిబ్రవరి 13న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. సినిమా మొత్తం ఎనిమిది భాషల్లో విడుదల కానుంది. తెలుగు, హిందీ, తమిళ్, కన్నడ, మలయాళం, చైనీస్, స్పానిష్, అరబిక్ భాషలలో మూవీని రిలీజ్ చేయనున్నారు. సినిమా షూటింగ్ ఇప్పటికే పూర్తయిందని టీమ్ వెల్లడించింది. విడుదల తేదీ ప్రకటించిన సందర్భంగా, మేకర్స్ 'రైజ్ ఆఫ్ స్వయంభు' అనే స్పెషల్ వీడియోను రిలీజ్ చేశారు. ఇందులో చిత్రంలోని భారీ స్కేల్, యుద్ధ సన్నివేశాలు, పీరియడ్ సెట్లు, నిఖిల్ లుక్ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. ఈ వీడియోతో చిత్రం పై ఉన్న హైప్ మరింత పెరిగింది. త్వరలో ప్రమోషన్లు పెద్ద ఎత్తున ప్రారంభం కానున్నాయి. ఈ చిత్రంలో సమ్యుక్తా, నభా నటేష్ హీరోయిన్లుగా కనిపించనున్నారు. ఇద్దరి పాత్రలు కూడా ప్రత్యేకంగా డిజైన్ చేసినట్టు సమాచారం. ఈ భారీ చిత్రాన్ని పిక్సెల్ స్టూడియోస్ బ్యానర్‌పై భువన్, శ్రీకర్ నిర్మిస్తుండగా, ప్రముఖ నిర్మాత టాగూర్ మధు ఈ సినిమాను ప్రెజెంట్ చేస్తున్నారు. సినిమాటోగ్రఫీ కె.కె. సెంథిల్ కుమార్ కాగా, ఇప్పటికే భారీ చిత్రాలకు కెమెరా వర్క్ అందించిన ఆయన విజువల్స్ ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణ కానున్నాయి. రవి బస్రూర్ సంగీతం అందిస్తున్నారు. యుద్ధ నేపథ్యం, భారీ సెట్స్, ఇంటెన్స్ కథ, పాన్-వరల్డ్ విడుదల ..ఈ అంశాలన్నీ కూడి 'స్వయంభు'ను నిఖిల్ కెరీర్‌లో అత్యంత భారీ ప్రాజెక్ట్‌గా నిలబెడుతున్నాయి. విడు దల తేదీ అనౌన్స్‌మెంట్ తర్వాత పోస్టర్లు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. 2026 ఫిబ్రవరి వరకు కొత్త అప్డేట్లు, పోస్టర్లు, ట్రైలర్లు వరుసగా విడుదలయ్యే అవకాశం ఉంది.




## ప్రభాస్ ఇమేజ్‌కు తగ్గట్లుగా రాజాసాబ్

### పాట విడుదల సందర్భంగా దర్శకుడు మారుతి ఎన్టీఆర్ అభిమానులకు క్షమాపణలు



ప్రభాస్ అభిమానులు తనపై పెట్టుకున్న నమ్మకానికి మించి 'ది రాజాసాబ్' ఉంటుందని దర్శకుడు మారుతి అన్నారు. ప్రభాస్  హీరోగా ఆయన దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'ది రాజాసాబ్'. తాజాగా ఈ సినిమా నుంచి 'రెబల్ సాబ్' అనే పాటను విడుదల చేశారు. ఈ సందర్భంగా మారుతి మాట్లాడుతూ.. ఈ చిత్రం విడుదలైన రోజు థియేటర్లు కేరింతలతో మార్మోగిపోవడం ఖాయమన్నారు. అందుకు తనదే హామీ అని చెప్పారు. మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిద్ది కుమార్ హీరోయిన్లుగా కనిపించనున్న ఈ చిత్రం జనవరి 9న విడుదల కానుంది. ప్రభాస్ కథానాయకుడిగా మారుతీ దర్శకత్వంలో రూపొందుతున్న రొమాంటిక్ కామెడీ హారర్ ఫిల్మ్ 'ది రాజా సాబ్' సంక్రాంతి కానుకగా జనవరి 9న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో చిత్ర బృందం ఒక్కో అప్‌డేట్ ఇస్తోంది. ఈ సినిమా నుంచి మొదటి పాట 'రెబల్ సాబ్'ను విడుదల చేసింది. తమన్ స్వరాలు సమకూర్చిన పాట ప్రస్తుతం ట్రెండ్ అవుతోంది. ఇకపోతే మారుతి వివాదంలో చిక్కారు. మైక్ ముందు ఉంది కదా అని ఏదో ఒకటి అనేస్తున్నారు.. ట్రోల్స్ కు గురవుతున్నారు.. మళ్లీ తిరిగి క్షమాపణలు కోరుతున్నారు. తాజాగా డైరెక్టర్ మారుతీ.. ఎన్టీఆర్ ఫ్యాన్స్ కు క్షమాపణలు చెప్పాడు. రిలీజ్ డేట దగ్గరపడుతుండడంతో ప్రమోషన్స్ మొదలుపెట్టిన మారుతీ.. రాజా సాబ్ నుంచి రెబల్ సాబ్ అంటూ సాగే సాంగ్ ను రిలీజ్ చేశారు. ఈ సాంగ్ లాంచ్ ఈవెంట్ లో మారుతీ.. ఎన్టీఆర్ ని అవమానించడంటూ ఫ్యాన్స్ రచ్చ చేయడం మొదలుపెట్టారు. ఈ ఈవెంట్ లో మారుతీ మాట్లాడుతూ.. 'కాలర్ ఎగరేసుకుంటారు.. అట్లా చెప్పను. ఎందుకంటే అవ్వన్నీ ఆ కట్ అవుట్ ముందు చాలా చిన్నవి అయిపోతాయి. నేను ప్రస్తుతం రెబెల్ యూనివర్సిటీలో చదువుకుంటున్నా. ప్రభాస్ ఫోటో జేబులో ఉంటే చాలు ఎలాంటి డైరెక్టర్ అయిన టాప్ డైరెక్టర్ అయిపోతాడు' అంటూ చెప్పుకొచ్చాడు. వార్ 2 ఈవెంట్ లో ఎన్టీఆర్ ఇలానే కాలర్ ఎగరవేసి తమ సినిమా హిట్ అవుతుందని చెప్పాడు. ఇప్పుడుమారుతీ ఎన్టీఆర్ నే అన్నాడని, తమ హీరోని పొగడడంలో తప్పు లేదు కానీ, వేరే హీరోతో కంపేర్ చేయడం .. ఆ హీరోని అవమానించడమే అని చెప్పుకొస్తున్నారు. ఇక ఈ విషయం పెద్దది కాకుండా మారుతీ ఆదిలోనే తుంచేశాడు. ఫ్యాన్స్ కి సారీ చెప్పి ఈ వివాదానికి ఫుల్ స్టాప్ పెట్టాడు. ' ముందుగా నేను ప్రతి అభిమానికి హృదయపూర్వకంగా క్షమాపణలు కోరుతున్నాను. ఎవరినీ బాధపెట్టడం లేదా అగౌరవపరచడం నా ఉద్దేశ్యం కాదు. కొన్నిసార్లు మాటల ప్రవాహంలో మనం అనుకున్న మాటలు అనుకున్నట్లు రాకపోవచ్చు. నేను అన్న మాటలు వేరే విధంగా అర్థం చేసుకున్నందుకు నేను చింతిస్తున్నాను.ఎన్టీఆర్ గారి పట్ల మరియు ఆయన అభిమానులందరి పట్ల నాకు అపారమైన గౌరవం ఉంది. సినిమా పట్ల,మీ హీరో పట్ల మీరు చూపే ప్రేమకు నేను నిజంగా విలువ ఇస్తున్నాను. ఇది నేను ఉద్దేశ్యపూర్వకంగా చేయలేదని మనస్ఫూర్తిగా చెప్తున్నాను. ఈ విషయాన్ని అభిమానులు అర్థం చేసుకుంటారని ఆశిస్తున్నాను' అంటూ చెప్పుకొచ్చాడు.

## విడుదలకు ముందే పెద్ది రికార్డులు


### చికిరి చికిరి పాటకు వందమిలియన్ వ్యూస్



విడుదలకు ముందే రికార్డులను తన ఖాతాలో వేసుకుంటోంది 'పెద్ది'. రామ్ చరణ్  హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ చిత్రం ప్రస్తుతం సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతోంది. దానికి కారణం ఇటీవల విడుదలైన 'చికిరి చికిరి' పాటనే. ఈ పాట రికార్డు స్థాయిలో వ్యూస్‌ను సొంతం చేసుకుంటోంది. 16 రోజుల్లో అన్ని భాషల్లో కలిపి 100 మిలియన్ల వ్యూస్‌ను (10 కోట్ల వ్యూస్) సొంతం చేసుకున్నట్లు టీమ్ తాజాగా తెలిపింది. దీంతో రామ్‌చరణ్ అభిమానులు సంబరపడుతున్నారు. మరోవైపు ఈ పాటలోని హుక్‌స్టెప్ కూడా బాగా వైరలవుతోంది. దీన్ని ఏకంగా సోషల్ మీడియాలో 5 లక్షల మందికి పైగా రీక్రియేట్ చేసినట్లు నిర్మాణ సంస్థ తెలిపింది. ఇన్‌స్టా, యూట్యూబ్‌లో కలిపి ఇంతమంది దీన్ని రీల్స్ చేసినట్లు వెల్లడించింది. అలాగే హీరో నితిన్ కుమారుడు కూడా ఈ పాటకు చేతులు కదుపుతూ ఎంజాయ్ చేయడం అందరినీ ఆకట్టుకుంటోంది. చికిరి చికిరి... అంటూ సాగే ఈ సాంగ్‌ను ప్రముఖ సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ స్వరపరచగా, మోహిత్ చౌహాన్ ఆలపించారు. బాలాజీ సాహిత్యం అందించారు. ఇందులో జాన్వీకపూర్ అచ్చియ్యమ్మగా కనిపించనున్నారు.

## కెవిఎన్ ప్రొడక్షన్‌లో రావిపూడి

ఈతరం దర్శకుల్లో దర్శకుడు అనిల్ రావిపూడి వినోదం ప్రధానంగా ఆయన సినిమాలుంటాయి. ఈ ఏడాది సంక్రాంతికి వెంకటేశ్‌తో 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాతో భారీ విజయాన్ని అందుకున్నారు. వచ్చే ఏడాది మెగాస్టార్ చిరంజీవితో 'మన శంకర వరప్రసాద్‌గారు' సినిమాతో ప్రేక్షకుల్ని అలరించేందుకు సిద్ధమవుతున్నారు. అయితే తాజాగా ఆయన గురించి ఓ వార్త నెట్టింట చక్కర్లు కొడుతుంది. దక్షిణాదిలో భారీ సినిమాలు చేస్తున్న కెవిఎన్ ప్రొడక్షన్‌లో ఓ సినిమా చేయబోతున్నారని వార్తలొచ్చాయి. ఆ వార్తలు నిజమే అన్నట్లు ఆదివారం అనిల్ రావిపూడి పుట్టినరోజు సందర్భంగా క్లారిటీ ఇచ్చారు. ఈ మేరకు ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు చెబుతూ నిర్మాణ సంస్థ ఓ పోస్ట్ పెట్టడంతో ఈ కాంబోలో సినిమా ఖాయమని క్లియర్ అయింది. అయితే ఇందులో హీరో ఎవరు? అనే వివరాలు వెల్లడించలేదు. ఇదే బ్యానర్‌లో చిరంజీవి – బాబీ కొల్లి సినిమా, యష్, విజయ్ ప్రాజెక్టులు ఉన్నాయి. అలాగే పవన్‌కల్యాణ్, లోకేశ్ కనకరాజ్ కాంబోలో కూడా ఓ సినిమా ఉంటుందని టాక్ నడుస్తోంది.




Mana Cinemalu

## నటి శ్రద్ధాకపూర్‌కు గాయం



నటి శ్రద్ధాకపూర్ ప్రస్తుతం 'ఈతా'లో నటిస్తోన్న సందర్భంగా ఇటీవల ఈ సినిమా షూటింగ్‌లో ఆమె కాలుకు గాయమైంది. దీంతో అభిమానులు ఆందోళన చెందారు. తాజాగా తన హెల్త్ అప్‌డేట్‌ను శ్రద్ధా పంచుకున్నారు. విశ్రాంతి తీసుకుంటున్నట్లు తెలిపారు. ఒక అభిమాని గాయం ఎలా ఉందని పోస్ట్ పెట్టగా దానికి ఆమె రిప్లై ఇచ్చారు. 'పెద్ద దెబ్బ ఏం కాదు.. కాలి కండరానికి దెబ్బ తగిలి కొంచెం ఫ్రాక్చర్ అయింది. డాక్టర్లు విశ్రాంతి తీసుకోమన్నారు. నేను క్షేమంగానే ఉన్నా. త్వరలోనే మీ ముందుకు వస్తాను' అని చెప్పారు. లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వంలో 'ఈతా' తెరకెక్కుతోంది. ఇటీవల నాసిక్‌లో ఒక భారీ సెట్ వేసి షూటింగ్ నిర్వహిస్తుండగా శ్రద్ధా కాలికి గాయమైంది. భారీ కాస్ట్యూమ్స్ ధరించి డ్యాన్స్ వేస్తుండగా  ప్రమాదం జరిగింది. ఎడమ కాలుకు గాయం కావడంతో షూటింగ్‌ను కొన్ని రోజులు నిలిపివేశారు . ఈ సినిమా కోసం ఆమె 15 కిలోల బరువు పెరిగినట్లు కూడా వార్తలు వచ్చాయి.

## సంక్రాంతి రేసు నుంచి తప్పుకున్న నవీన్ పోలిశెట్టి?




యంగ్ హీరో నవీన్ పోలిశెట్టి, మీనాక్షి చౌదరి జంటగా మారి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం అనగనగా ఒక రాజు. సితార ఎంటర్ టైన్మెంట్స్ బ్యానర్ పై సూర్య దేవర నాగవంశీ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాడు. ఇప్పటికే ఈ చిత్రం నుంచి రిలీజైన పోస్టర్స్, ప్రమోషనల్ కంటెంట్ అంతా మంచి ఆదరణను అందుకున్నాయి. ఎన్నో ఏళ్లగా ఈ సినిమా రిలీజ్ కోసం ఎదురుచూస్తూ ఉంది. ఎట్టకేలకు వచ్చే ఏడాది సంక్రాంతి బరిలో రాజుగారు దిగుతున్నారు అంటూ మేకర్స్ ప్రకటించారు. దీంతో అందరూ ఈ సినిమా కోసం ఎదురుచూస్తూ ఉన్నారు. ఈ మధ్యనే నవీన్ పోలిశెట్టి ప్రమోషన్స్ తో అదరగొట్టాడు. అయితే అది కూడా మూడునాళ్ళ ముచ్చటగా మారిపోయింది. అందుతున్న సమాచారం ప్రకారం ఈ సంక్రాంతి బరిలో కూడా రాజుగారు రావడం లేదని తెలుస్తోంది. చిరంజీవి మన శంకరవరప్రసాద్ గారు, ప్రభాస్ ది రాజా సాబ్, రవితేజ భర్త మహాశయులకు విజ్ఞప్తి, విజయ్ జన నాయగన్, శర్వానంద్ నారీ నారీ నడుమ మురారి లైన్ లో ఉన్నాయి. ఇక ఇన్ని సినిమాలతో పోటీ తట్టుకోలేక రాజుగారు డ్రాప్ అయ్యారని, సంక్రాంతి రేసు నుంచి నవీన్ తప్పుకున్నాడని వార్తలు వస్తున్నాయి. అందుకే ప్రమోషన్స్ కూడా మధ్యలోనే ఆపేశారని సమాచారం. త్వరలోనే ఈ విషయాన్ని మేకర్స్ అధికారికంగా తెలపనున్నారట. మరి ఇందులో నిజమెంత అనేది తెలియాల్సి ఉంది.